బోటోడితో మాట్లాడానికే వొప్పుకోరు. అట్టాంటిది..''

''సరే సరే.. ఆయన.. మహామండలేశ్వరులు.. వారేమన్నారు??''.

జాయపునిలో ఆశ్చర్యం, దిగ్భ్రమ కలసిన అసహన కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి.

''ఆ సావి దేవుడు మారాజా! కానీ, ఆ దేవుడుగోరు కూడా నన్ను కనికరించలేదు. పొమ్మన్నాడు.. 'బయటకు పో.. ఇది రాజాస్థానం. ఇక్కడ గొప్పగొప్ప విద్వాంసులకే గౌరవం. డప్పు ఇక్కడ వాయించడానికి సరిపోదు. చాటింపుకు, శవాల కాడ వాయించుకో.. పోపో!' అన్నారు సావి..''

ఖంగుతిన్నట్లు కొయ్యబారిపోయాడు జాయపుడు. బోరున విలపిస్తున్నాడు సూరప. మళ్లీ చావుదెబ్బ. గొడ్డలితో గుండెపై నరికారు. నరికింది ఎవరోకాదు. బావగారు! అంటే సాక్షాత్తూ దేవుడు!!

విక్రమపై వాలిపోయాడు జాయపుడు. అప్పుడు తడిశాయి కళ్లు. తొలిసారి.. బావగారిపై.. నమ్ముకున్న దేవుడే అవమానించినట్లు.. కోపంతో శరీరం వణికింది.

సూరప డప్పు తీసుకుని మెల్లగా వాయించసాగాడు.

చివ్వున కదిలి భుజానున్న ఉత్తరీయం నడుముకు కట్టుకుని స్థానకం తీసుకుని కాలు కదిలించాడు. తలపై కెత్తి రుద్రదేవునికి నమస్కరించి కాలు కదిలించాడు. జాయపుని శరీరభాష గుర్తించిన సూరప నిలబడి ఆయన నృత్త కదలికలకు అనుగుణంగా డప్పు వాయించసాగాడు.

ఇద్దరు కళాకారులు తీవ్ర అవమానభారంతో, దుఃఖ భాజనమైన మనస్సుతో, విషాద హృదయాన్ని రసావిష్కరణ జరిపితే.. ఆ నృత్తం, తదనుగుణమైన డప్పువిన్యాసం ఎలా ఉంటుందో ఆ అర్ధరాత్రి కటికచీకటిలో.. పైన చంద్రుడు, దగ్గరగా కృష్ణమ్మ, ఆవలగా సముద్రుడు మౌనంగా సజలనయనాలతో వీక్షించారు.

ఆ అద్భుత విషాద తాండవ నృత్తవిన్యాసాలకు ఆ రుద్రదేవుడే స్పందించాడా అన్నట్లు అప్పటికప్పుడే చిన్నపాటి వర్షం ఇద్దరినీ తడిపిపోయింది. ఆ వర్షంలో ఆ అలా డప్పు మోగుతూనే ఉంది.. గజ్జెలు లేని పాదాలు తాండవ నృత్తమాడుతూనే ఉన్నాయి. ఆడిఆడి వర్షంలో తడిసి తడిసి అక్కడే కుప్పకూలిపోయాడు జాయపుడు.

'ఎంత అవమానం చేశారు బావగారూ!'..

అయితే, గణపతిదేవునితో తను చెప్పమన్న ఒక్క మాట సూరప్పుడు చెప్పలేదని జాయపునికి తెలియదు.

మర్నాడు ఉదయానికి మొదటి రాజసత్రం వద్దకు చేరాడు జాయపుడు. ధనదుపురానికి, అనుమకొండకు మధ్య పాతిక రాజసత్రాలున్నాయి. అవి కాకతీయ రాజవంశాల వారికి మాత్రమే పరిమితం.

చిందరవందరగా ఉన్న తలకట్టు.. అసహ్యంగా పెరిగిన గడ్డం.. బురదలో నృత్తం తొక్కాడేమో.. మట్టి కొట్టుకుపోయిన కంచుకం, పంచె, ఉష్ణీషం.. మొత్తంగా పరమ అసహ్యంగా ఉన్న జాయపుణ్ని చూసి.. రాజసత్రం నిర్వాహకుడు జాలయ అలా ఉండిపోయాడు.

జాలయ ముఖకవళికలు గుర్తించిన జాయపుడు..

''కాస్త విశ్రాంతి తీసుకుంటాను. మంగళవాడిని పిలిపించు..'' అంటూనే తల్పంపై వాలిపోయాడు.

క్షౌర సంస్కారంతో కాస్త ఊపిరి తీసుకుని తిరిగి బయల్దేరుతున్న జాయపునితో అన్నాడు జాలయ..

''పై సత్రంవద్దకు తమరికి కొత్తదుస్తులు సిద్ధం చెయ్యమని వార్త పంపాను దేవరా..''

తిరిగి చూసి ఆప్యాయంగా నవ్వి విక్రమను అధిరోహించాడు. మరి నాలుగురోజుల తర్వాత అనుమకొండ చేరాడు. అప్పటికి గూడుకట్టుకున్న విషాదం గుమ్మనంగా లోలోన ఘనీభవించింది. ప్రదేశం మారడంతో కాస్త వాన వెలసినట్లు తెరిపిన పడినట్లయ్యింది.

సైనిక స్వాగతంతో మరికాస్త తేరుకున్నాడు.

* * *

పుర నివాసం. మర్నాడు తన పురనివాసం ముందు నిలబడి మొత్తంగా పైనుంచి కిందికి చూసుకున్నాడు. దాని కింది భాగమంతా వెలనాడు మండలేశ్వరుని కార్యాలయం. ఈ మధ్యకాలంలో వెలనాడు మండలాధికారుల కార్యకలాపాలు ఎక్కువకావడంతో మరిన్ని నియోగాలు వచ్చాయి.

కానీ, మొదటి అంతర్వులో అతని నివాసం మాత్రం అలాగే ఉంచారు. అంతా తిరిగి చూసుకున్నాడు.

తర్వాత రాజప్రాసాదం, నియోగాలు, రాజనగరి.. అంతా తిరిగాడు. రాజప్రాసాదపు రూపురేఖలు మారాయి. రాజనగరిలో కూడా ఎంతో మార్పు.. వీధులు చూస్తూ ఆ ఇల్లు.. గతంలో ఇంద్రాణి వాళ్ల ఇల్లు ఉన్న వీధిలోకి మళ్లబోతూ ఆగి మరోవైపు వెళ్లాడు. ఎదురొచ్చిన వారంతా కొత్తగా కనిపిస్తున్నారు. ఒక్కరో ఇద్దరో పాతవాళ్లు. వాళ్లు కూడా కుశలప్రశ్నలు వేశారు వాళ్ల ధోరణిలో.

''జాయసేనానీ.. ఏమిటి.. వెలనాడు వెళ్లాక కాస్త ఒళ్లు చేశారే?!''.

''కాస్త ముదురు తేలారు..'' అంటూ జాయపుణ్ని కొత్తగా చూడసాగారు.

పరిపాలనా భవనాలు కూడా కొత్తవి కనిపించాయి. కొత్తనియోగాలు, అధికారులు, మంత్రులు, మహామంత్రులు, సేనానులు, దళపతులు, సైన్యాధ్యక్షులు.. ఒకరేమిటి.. పరిచారికలు, కంచుకీలు, ప్రతీహారులు, కాపలాభటులు.. వేగులు కూడా చాలామంది మారిపోయారు. అక్కడక్కడా పాతముఖాలు కనిపిస్తున్నాయి. కానీ, జాయసేనాని, జాయ చమూపతి, జాయ గజసాహిణి, జాయచోడుడు, జాయ చోడదేవుడు.. ఏ పేరు ఉచ్చరించినా విన్నవారులా గుర్తుపట్టి ఆత్మీయంగా, అత్యంత వినయవిధేయతలతో, రెప్పవేయని ఆశ్చర్యంతో.. కొత్తవాళ్లు నిబిడాశ్చర్యంతో నోర్లు వెళ్లబెట్టి.. పాతవాళ్లు మధురస్మృతుల మాధుర్యచూపులతో..

తర్వాత గణపతిదేవుడు వచ్చారని తెలిసినా ఆయనను కలవలేదు. సూరప్పడి అవమానం తనదిగా భావించి.. గణపతిదేవునిపై కలిగిన కోపం ఆయనను కలవకుండా చేసింది.

ఓ సాయంత్రం కళామందిరానికి వెళ్లాడు. దూరం నుంచే కళాత్మక పరిమళం! ఆత్మీయబంధం!!

ఉద్వేగం హెచ్చింది. గబగబా వెళ్లబోయి సూరప్పడికి జరిగిన అవమానం ఇక్కడే కదా.. అని గుర్తొచ్చి మెల్లగా, మౌనంగా వెళ్లాడు లోపలికి. ఊహాతీతంగా లోపల నాట్యప్రదర్శన.. జాయచోడుని నృత్తరీతులతో లాస్య నృత్తం ప్రదర్శిస్తున్నది లలితాంబ. ఆశ్చర్యంగా చూస్తూ మరికొన్ని అడుగులు వేశాడు.

జాయచోడుణ్ని ఆమె చూడటం ఏమిటి.. నృత్తం ఆపడం ఏమిటి.. అందరూ తలతిప్పి జాయచోడుణ్ని చూడటం, గుర్తించడం ఏమిటి!? అన్నీ ఒకేసారి జరిగాయి. మందిరమంతా కోలాహలం.. ఉత్సాహ ఉద్వేగాల పరవళ్లు.

ఖంగుతిన్నాడు జాయచోడుడు. అంతా చుట్టుముట్టడంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. అక్కడున్నవారిలో ముప్పాతిక ముప్పంతులమంది అతనికి పూర్తిగా కొత్త. అయితే జాయచోడుడు వెలనాడు మండలేశ్వరునిగా అక్కడ నిర్మించిన కూసెనపూండి కళాక్షేత్రం, కళాయుద్ధం ద్వారా మతఘర్షణలను నివారించి విజయం సాధించడం.. రెండూ సామాన్య విషయాలు కాదు. ఎవరెవరో ముందుకొచ్చి చేతులు పట్టుకోవడం.. వంగి నమస్కరించడం.. ఏదేదో పొగడటం.. ఏవేవో గుర్తుచేయడం.. తమను తాము పరిచయం చేసుకోవడం.. వాళ్ల రచనలను ఉటంకించడం.. వాళ్ల నాట్య, నృత్త, నృత్యాలను చెప్పుకోవడం..

జాయచోడుని ఇబ్బంది గుర్తించిన లలితాంబ ముందుకొచ్చి అందరినీ నిలువరించి ఒక్కొక్కరినీ ఆయనకు పరిచయం చేయసాగింది. అది అందరికీ ఎంతో బాగున్నా.. జాయచోడుని ముఖ కవళికలు చూస్తుంటే అసలు వింటున్నాడో లేదోనని వారంతా భావిస్తుండగా.. జాయచోడుడే లలితను మెల్లగా అడిగాడు.

''లలితా.. మహామండలేశ్వరులు.. అదే బావగారు ఇప్పుడు ఇక్కడికి వస్తారా??''

''ఇప్పుడే మరికొన్ని క్షణాలలో వారు ఎప్పుడైనా రావచ్చు. నిన్ననే నన్ను అడిగారు.. 'జాయ వచ్చాడు కలిశావా!?' అని..'' మరేదో చెప్పబోతుండగా చటుక్కున చేతులెత్తి అందరికీ నమస్కరించి.. వేగంగా ఎవరో తరుముతున్నట్లు బయటికి వెళ్లిపోయాడు జాయచోడుడు. అయితే ఆయన తొందరతొందరగా వెళ్లిపోతుండటం.. అప్పుడే పల్లకి దిగిన గణపతిదేవుడు చూశాడని జాయచోడునికి తెలియదు.

* * *

అంతఃపురంలోకి వెళ్లబోతూ ఆ ద్వారాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఒక్కటే ద్వారం!

మొన్న వచ్చాడు కదా.. అప్పుడు గుర్తించలేదు.. అక్కను చూడాలన్న తొందరలో. అంటే బావగారు రెండు అంతఃపురాలు ఏకం చేశారన్నమాట.

గతంలో హరిహరుని మరణవార్త అందినప్పటి సంఘటన గుర్తొచ్చింది. అద్దంకి, పాకనాడు రాజ్యాల మతగొడవల సమయంలో..

''దేవరా తమరికి ప్రత్యేక వార్త'' అంటూ అనుమకొండ వార్తాహరుడు లేఖాపత్రాన్ని అందించాడు.

'హరిహరదేవుడు మరణించాడు..'

భారంగా కుప్పకూలిపోయాడు. తమ పిల్లలు తమ కళ్లముందే మరణించడం.. హతవిధీ!!

పసివాడిగా ఉన్నప్పుడే అతనిపై విషప్రయోగం జరిగినప్పటినుంచీ హరిహరదేవుడు కోలుకోలేదు. ఎప్పుడూ ఏదో అనారోగ్యమే. చివరికి శివసాయుజ్యం పొందాడు.

''ఒకడికి మేము కొలిచే మురారి అని, మరొకడికి హరిహరులకు భేదం లేదని మేము నమ్మినట్లు హరిహరదేవుడు అని నామకరణం చేద్దాము..'' అన్నాడు గణపతిదేవుడు కొడుకులు పుట్టిననాడు.

అక్కకు, బావగారికి గర్భశోకం!

(సశేషం)

**ఇద్దరు కళాకారులు తీవ్ర అవమాన భారంతో, విషాద హృదయాన్ని రసావిష్కరణ జరిపితే.. ఆ నృత్తం, తదనుగుణమైన డప్పువిన్యాసం ఎలా ఉంటుందో ఆ అర్ధరాత్రి కటిక చీకటిలో.. పైన చంద్రుడు, దగ్గరగా కృష్ణమ్మ, ఆవలగా సముద్రుడు మౌనంగా సజలనయనాలతో వీక్షించారు.**